క్లుప్తంగా

అధికార పార్టీలో బయట పడిన లుకలుకలు

● టీడీపీ నాయకుల ఆధిపత్య పోరుతో నలిగిపోతున్న అధికారులు

మద్దిపాడు: అధికార పార్టీ నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో అధికారులు నలిగిపోతున్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సంఘటన అందుకు నిదర్శనంగా ఉంది. మద్దిపాడులో టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యేకి ఆహ్వానం పంపారు. వ్యక్తిగత పనుల దృష్ట్యా రాలేకపోతున్నానంటూ ఎమ్మెల్యే తెలపడంతో అధికార పార్టీకి చెందిన మండల నాయకులను ఎంపీడీవో ఆహ్వానించారు. వారిలో ఒక నాయకుడు తాను రానని తెలిపాడు. ఆ నాయకుడు లేకుండా మేమెందుకు అంటూ మరో ఇద్దరు నాయకులు మొహం చాటేశారు. మరో నాయకుడు ఒంగోలు నుంచి మద్దిపాడు వచ్చి సాయంత్రం ఐదున్నర వరకు ఎదురుచూసి తిరిగి వెళ్లిపోయాడు. చివరకు ఎవరూ లేక శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవోనే ప్రారంభించారు. అధికార పార్టీ నాయకులలో లుకలుకలు బహిర్గతం కావడం విమర్శలకు తావిస్తుండగా, అధికారులకు తలనొప్పిగా మారింది.

జిల్లా సరిహద్దుల్లో ఆకస్మిక తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శివరామయ్య

మద్దిపాడు: ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దుల్లో శనివారం ఆకస్మికంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక శక్తులను, నిషిద్ధ వస్తువుల రవాణాను అదుపు చేసే క్రమంలో, అనుమానిత వ్యక్తులు జిల్లాలోకి ప్రవేశించకుండా ఉండేందుకు మద్దిపాడు ఎస్సై బి.శివరామయ్య సమక్షంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది జిల్లా సరిహద్దు ప్రాంతమైన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

పహల్గామ్ సంఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాపు సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: పహల్గామ్‌లో పర్యాటకులపై దాడికి నిరసనగా జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఒంగోలులోని రామ్‌నగర్‌లో రంగా విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ.. చర్చి సెంటర్ వరకూ సాగింది. ఈ సందర్భంగా కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ మాట్లాడుతూ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మృతిచెందిన వారి కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. కాల్పుల్లో గాయపడిన వారు తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టి.శ్రీనివాస మూర్తి, ఎన్.సాంబయ్య, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నాటక కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఆర్వో ఓబులేసు

ఒంగోలు టౌన్: కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో సామాజిక చైతన్య ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి బీసీహెచ్ ఓబులేసు అన్నారు. కేవీపీఎస్ పోరాట సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ నాటక కరపత్రాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. హైదరాబాద్ వారిచే మే 8న ఒంగోలులో, 9న మద్దిపాడులో శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్, జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాఘవులు, జేసు రత్నం, జిల్లా కమిటీ సభ్యుడు సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

గిద్దలూరు రూరల్: మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని స్త్రీ నిధి ఏజీఎం చార్లెస్ హర్షవర్ధన్ అన్నారు. స్థానిక వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ నిధి ద్వారా రుణాలు పొందిన మహిళలు త్వరగా వారి రుణాలు చెల్లించి కొత్త రుణాలు తీసుకునేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు క్లస్టర్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎం కె.నరేష్, సీసీలు శిరీష, వెంకటేశ్వర్లు, కల్పన, రంగనాయకులు పాల్గొన్నారు

బాలికలపై లైంగిక దాడులను నిరోధించాలి



మద్దిపాడులో మాట్లాడుతున్న జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మి, పాల్గొన్న అధికారులు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి

● జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మి

మద్దిపాడు: బాలికలపై లైంగిక దాడులను నిరోధించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం కిశోర బాలికల వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, జీఎంఎస్‌కేలు, వీవోఏలు, అంగన్‌వాడీ వర్కర్లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమంలో లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ఉమెన్ ట్రాఫికింగ్, బాల్యవివాహాల నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వారానికి రెండు రోజులపాటు ప్రతి గ్రామంలో 14 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఆయా కార్యక్రమాల్లో బాలికలతో సన్నిహితంగా మెలుగుతూ వారికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అత్యాచారాలు, బాలికల అక్రమ రవాణా, బాల్యవివాహాలను నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ ఆఫీసర్ బి.రత్నప్రసాద్, ఎంపీడీవో డీఎస్‌వీ ప్రసాద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆనంద మోహన్, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వీవోఏలు, జీఎంఎస్‌కేలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలి...

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయిలో కిశోర బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వ్యక్తిగత పరిశుభ్రత, నాణ్యమైన విద్య, లింగ వివక్షతో పాటు ఆత్మరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మి, జిల్లా లీగల్ అధికారి రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహాలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కిశోర వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తప్పకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవి, రమణయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై తల్లిదండ్రులను చైతన్యపరచాలి

సంతనూతలపాడు: బాల్య వివాహాల నిషేధం, బాలికల అక్రమ రవాణా, బాలికలపై అత్యాచారాల నిర్మూలన, తదితర వాటిపై గ్రామ స్థాయిలో తల్లిదండ్రులను మరింతగా చైతన్యపరచాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కిశోర్ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో డి.వెంకారెడ్డి అధ్యక్షత వహించగా, ఎంపీడీవో పాల్గొని బాలికలకు విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, మంచి పోషక విలువలు గల ఆహారం తీసుకోవడం, తదితర అంశాలపై సమీక్షించారు. కిశోర్ వికాసంపై ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతీబాయ్, మండల స్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సచివాలయం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి రూరల్: కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలపై సమాజంలో జరుగుతున్న దుర్ఘటనలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ మద్దిపాడు సీడీపీఓ ఇవాంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బంది హాజరయ్యారు.



చీమకుర్తిలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

క్విస్‌లో 'పర్యావరణ పరిరక్షణ గతివిధి'



క్విస్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న పర్యావరణ పరిరక్షకుడు శివాజీ, తదితరులు

● పాల్గొన్న 600 మంది విద్యార్థులు

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో రామానుజన్ సెమినార్ హాలులో శనివారం పర్యావరణ పరిరక్షణ గతివిధి కార్యక్రమం నిర్వహించారు. క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి పాల్గొనగా, కళాశాలకు చెందిన 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, చెట్లు పెంచడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అద్భుతమైన ప్రసంగం చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక ఏకేవీకే కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, పర్యావరణ పరిరక్షకుడు డాక్టర్ శివాజీ, పర్యావరణ పరిరక్షణ గతివిధి ప్రాంత కార్యదర్శి చంద్రశేఖర్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను వివరించారు. దాన్ని ఎలా నివారించాలో విద్యార్థులకు తెలియజేశారు. పర్యావరణాన్ని కాపాడతామని, దాన్ని తమ బాధ్యతగా తీసుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యతని క్విస్ కళాశాల ప్రిన్సిపాల్ వై.వి. హనుమంతరావు అన్నారు. పాత రోజుల్లో ప్రతి ఒక్కరూ పాటించే పద్ధతులు మనం అవలంబిస్తే ఆరోగ్యంగా ఉంటామని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిశోర్‌బాబు అన్నారు. కార్యక్రమాన్ని క్విస్ కళాశాల ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ హిమబిందు, ఎంసీఏ హెచ్‌వోడీ డాక్టర్ కొండలరావు, బీ ఫార్మసీ హెచ్‌వోడీ డాక్టర్ రేవతి, డాక్టర్ విద్యానాథబాబు పర్యవేక్షించగా, అశోక్, డాక్టర్ కాలె మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నుంచి విముక్తులైన వారికి దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖాధికారిని బేబీరాణి

కొత్తపట్నం: వెట్టిచాకిరి నుంచి విముక్తులై మండలంలోని అల్లూరు పునరావాస కేంద్రంలో ఉంటున్న పిల్లలు, మహిళలు, కార్మికులకు ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిని డాక్టర్ బేబీరాణి ముఖ్య అతిథిగా హాజరై బెడ్ షీట్లు, టవళ్లు, స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్వీట్లు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు, జాకెట్లు, వివిధ రకాల దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ మూగజీవాల ఆరోగ్యానికి పశువైద్యులు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెల చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఈ సందర్భంగా వెట్టిచాకిరి నుంచి విముక్తులై అల్లూరు పునరావాస కేంద్రంలో ఉంటున్న కుటుంబాలకు వస్తువులు, దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ శోభ, డాక్టర్ అనిల్, డాక్టర్ భరత్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకలకు భూములు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోచయ్య

రాచర్ల: ఎరుకుల కుటుంబాలకు భూములు కేటాయించి వారిని ఆర్థికంగా ఎదుగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఎన్‌జీవో ఎమ్‌ఎఫ్‌పీ బ్యాంబూ సొసైటీ అధ్యక్షుడు కే.పోచయ్య అన్నారు. మండలంలోని ఆకవీడు గ్రామంలో ఎస్టీకాలనీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గుంటూరు హెడ్ ఆఫ్ ది ఫారెస్టు ప్రిన్సిపాల్ చీఫ్ సెక్రటరి వారు రెండేళ్లకోసారి మంజూరు చేసే 2 వేల వెదురు బొంగులు కుటుంబానికి పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాక అటవీశాఖ అధికారులు ఆకవీడు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతానికి ఆదివాసులను వెళ్లనివ్వడం లేదని దీంతో ఆదివాసులు చేతి వృత్తుల పనులు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంవత్సరానికి ఒక్కసారి ఐదు వేల ఎదురు బొంగులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 5 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని మంజూరు చేయడమే కాకుండా ఎఫ్‌ఆర్‌ఏ సర్టిఫికెట్ మంజూరు చేయాలని వివరించారు. కార్యక్రమంలో దేవరకొండ పద్మా, పాముసాని రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గవర్నర్ ఏడీసీ పూజలు



పూజలు చేస్తున్న రామాంజనేయులు

మార్కాపురం: లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏడీసీ, అదనపు ఎస్పీ ఎన్‌వీ రామాంజనేయులు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి గర్భాలయంలో అర్చకులు అప్పనాచార్యులు, రామాంజనేయులతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం బహూకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2017లో ఆయన మార్కాపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో రాష్ట్రంలోనే తొలిసారిగా హైవే రోడ్లపై యాక్సిడెంట్ల నివారణకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇప్పుడు రాష్ట్రమంతా అమలు జరుగుతోంది.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ



జైలులో సరుకులను పరిశీలిస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని స్థానిక సబ్ జైలును గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు లోని ఖైదీలను ఉంచే గదులను పరిశీలించారు. నిత్యావసరాలు, వంట గదులను పరిశీలించారు. జైలులోని ఖైదీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం ద్వారా ఖైదీలకు చట్టాల పై అవగాహన కల్పించారు. మే నెల 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ను 5వ తేదీనే నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టానుసారం ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

చీమకుర్తి: దుకాణాల నిర్వాహకులు, ప్రజలు ఇష్టానుసారంగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య సూచించారు. శనివారం చీమకుర్తిలోని తన కార్యాలయంలో దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు.

పన్నుల వడ్డీపై 50 శాతం రాయితీ...

మున్సిపాలిటీలోని ఇళ్లు, ఖాళీ స్థలాలపై గత ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించని వారికి ఈ నెలాఖరు వరకు చెల్లించే అవకాశం కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. ఈ నెలాఖరులోపు చెల్లించే వారికి పన్నుపై చెల్లించే వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. దాంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం చెల్లించే పన్నులో ముందుగానే చెల్లిస్తే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ప్లాస్టిక్ పదార్థాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రామకృష్ణయ్య



చుండూరి రవిబాబును సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

● వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు భరోసా ఇచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు మండల వైస్ ఎంపీపీ ఐలా వాణి, నాయకుడు ఐలా ఏడుకొండలు, వారి కుటుంబ సభ్యులు శనివారం చుండూరి రవిబాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజుల క్రితం గుండాయపాలెం ఎంపీటీసీ ఐలా వాణి భర్త ఐలా ఏడుకొండలు, మరో ముగ్గురిపై ఒంగోలు తాలూకా పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. వారికి రిమాండ్ విధించగా, చుండూరి రవిబాబు ఇచ్చిన మాట ప్రకారం బెయిల్ మంజూరు చేసేందుకు కృషి చేశారు. వారికి బెయిల్ మంజూరైన నేపథ్యంలో రవిబాబును కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. బెయిల్ మంజూరు కోసం కృషి చేసిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావును కూడా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాల దాహం తీర్చాలి

● ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి
● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మట్టి మూకుళ్లలో నీరు నింపుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: మూగజీవాల దాహం తీర్చడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా కోరారు. వరల్డ్ వెటర్నరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. నగరంలో తిరుగుతున్న పశువులు, కుక్కలకు 50 సిమెంటు తొట్లు, పక్షులకు మట్టి పాత్రలు ఏర్పాటు చేసేందుకు వాటిని పలువురికి కలెక్టర్ పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ ప్రాంగణంలో చెట్లకు ఏర్పాటు చేసిన మట్టి మూకుళ్లలో నీరు నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశువులకు నీటి తొట్లు, పక్షులకు మట్టి పాత్రలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మనుషులకు చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయడం సహజమన్నారు. కానీ, పశువులు, కుక్కలు, పక్షులకు వేసవిలో తాపం, దాహం తీర్చడానికి నీటిని నిల్వచేసి వాటి ప్రాణాలు కాపాడాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ, ఏఆర్ ఏఎస్పీ, ఎంఈఓ చెంచయ్య, డీఈఓ పద్మజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సులభతరంగా భవన నిర్మాణాలకు అనుమతులు

ఒంగోలు సబర్బన్: భవన నిర్మాణాలకు అనుమతులు పొందడానికి ఇక నుంచి సులభతరమైన విధానం అమల్లోకి వచ్చిందని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. స్వీయ ధ్రువీకరణ పథకం–2025ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు స్వీయ ధ్రువీకరణ అంగీకారపత్రం సమర్పించి సులభతరంగా నిర్మాణ అనుమతులు పొందే వెసులుబాటు కల్పించిందన్నారు. అందులో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ కార్యాలయం ద్వారా లైసెన్స్ పొందబడిన లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, సర్వేయరు, ఇంజినీర్లు ద్వారా గ్రామ కంఠము, అప్రూవల్ లే అవుట్లు, సర్కిలేషన్ ప్యాట్రన్స్ అప్రూవల్ అయిన ప్రాంతాలలో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతులను స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి సులభంగా, వేగంగా, అత్యంత పారదర్శకంగా పొందవచ్చని వివరించారు. అదేవిధంగా, ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు (ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్) నగరపాలక సంస్థ కార్యాలయానికి నేరుగాగానీ, ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారాగానీ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్, ఇంజినీర్ల లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుని లైసెన్స్ పొందవచ్చని కమిషనర్ వివరించారు.

57 మంది రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రైజ్ కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న 57 మంది విద్యార్థులు ఆల్ డీజీ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ శిద్దా వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఆల్ డీజీ టెక్నాలజీస్ తరఫున హెచ్‌ఆర్ సురేందర్ కళాశాలకు వచ్చి విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రూ.2,40,000 వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్‌వీ రఘుబాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు అభినందించారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల పట్టిక ప్రదర్శించాలి

ఒంగోలు వన్‌టౌన్: ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో తరగతుల వారీగా ఫీజుల పట్టిక ప్రదర్శించాలని జైజనం పార్టీ నాయకుడు చప్పిడి రవిబాబు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం డీఈఓ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలోని కార్పొరేట్ స్కూళ్లలో ఎల్‌కేజీకి రూ.25 వేలకుపైగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. 7వ తరగతికి రూ.35 వేలు, 10వ తరగతికి రూ.60 వేల వరకూ వసూలు చేస్తున్నారన్నారు. అదేమంటే ఐఐటీ ఫౌండేషన్ అని, ఒలింపియాడ్ కోర్సు అని మరో రూ.10 వేలను అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. పుస్తకాలకు 6 వేల నుంచి 7 వేల రూపాయల వరకూ వసూలు చేస్తున్నారన్నారు. ఈ పుస్తకాలు కనీసం రూ.2 వేలు కూడా చేయవన్నారు. కార్యక్రమంలో యోహాను, ఏసుదాసు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.